క్లుప్తంగా

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



ధ్యాన మాస్టర్ రవిచంద్రకు సత్కారం

చేజర్ల: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని పిరమిడ్ ధ్యాన మాస్టర్ రవిచంద్ర పేర్కొన్నారు. మండలంలోని పులిసీళ్లపల్లి గ్రామంలోని వెంకయ్యస్వామి మందిరంలో ధ్యానంపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనస్సును ప్రశాంతంగా ఉంచుకుని రోజూ అరగంటపాటు ధ్యానం చేస్తే ఎటువంటి అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. ఆరోగ్యానికి ధ్యానంతో పాటు నడక ఉత్తమ సాధనాలన్నారు. అనంతరం పిరమిడ్ మాస్టర్‌ను నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ధ్యాన కమిటీ సభ్యుడు ఎం వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

25 యూనిట్ల మినీగోకులాల మంజూరు

కలిగిరి: ప్రభుత్వం మండలానికి ఉపాధి హామీ పథకం ద్వారా 25 యూనిట్ల మినీ గోకులాలను మంజూరు చేసినట్లు కలిగిరి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు కే సురేష్ బాబు ఆదివారం తెలిపారు. పాడి పశువుల షెల్టర్లకు 90 శాతం, గొర్రెలు, మేకల షెల్టర్ల కు 70 శాతం రాయితీ అందిస్తున్నట్లు చెప్పారు. సన్న, చిన్నకారు రైతులు, సొంత భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీలు ఇందుకు అర్హులని తెలిపారు. రెండు పశువుల యూనిట్ విలువ రూ. 1,15,000 కాగా, రైతు వాటాగా రూ.11,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. నాలుగు పశువుల యూనిట్ విలువ రూ.1,85,000 కాగా, రైతు వాటా రూ.18,500 చెల్లించాలన్నారు. ఆరు పశువుల యూనిట్ విలువ రూ. 2,30,000 కాగా, రైతు వాటాగా రూ.23,000 చెల్లించాలన్నారు. ఆసక్తి కలిగిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లోని పశు సంవర్ధక శాఖ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

వైభవంగా గంగమ్మ గ్రామోత్సవం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లిలో గంగమ్మ గ్రామోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహిస్తున్నారు. గత రెండ్రోజులుగా జరుగుతున్న జాతర మహోత్సవంలో భాగంగా గంగమ్మను విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. తొలుత గంగమ్మకు విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు.

మానసాదేవికి నెల పొంగళ్లు



వరికుంటపాడు: మండలంలోని తూర్పురొంపిదొడ్లలో కొలువైన మానసాదేవికి నెల పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పొంగళ్ల సామగ్రి బుట్టలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారు శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

జేవీవీ సమావేశం



వరికుంటపాడు: జనవిజ్ఞానవేదిక మండల శాఖ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రకాశం జిల్లా పామూరులోని కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర,మండల నాయకులు శ్రీనివాసులరెడ్డి, చెన్నకేశవులు, వెంకటసుబ్బయ్య, సుబ్బారావు, ఎస్. రమణయ్య, మాల్యాచలం, డీవీ రమణయ్య పాల్గొన్నారు. ఇటీవల బెంగళూరులో జరిగిన జేవీవీ ఐదో జాతీయ మహాసభలపై చర్చించారు. అనంతరం భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. సైన్స్ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచి విజ్ఞానాన్ని పెంపొందించాలని తీర్మానించారు.

పచ్చిమేతలో పోషక విలువలు

పదో వంతు భూమిలో పశుగ్రాసాలు పెంచాలి

- తద్వారా పచ్చిమేత కొరతను అధిగమించొచ్చు
- ఎండుగడ్డి కంటే పచ్చిగడ్డితోనే అధిక పాలదిగుబడులు



పశుగ్రాసం కోసం పెంచుతున్న మొక్కజొన్న

ఉదయగిరి: పశుపోషణ పాడి రైతులకు భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో సమగ్ర పశుపోషణ పద్ధతులను అలవరుచుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. సమగ్ర పశుపోషణతోనే పశువులు ఆరోగ్యకరమైన జీవనం సాగించగలవని పేర్కొంటున్నారు. ప్రధానంగా పచ్చిమేత వలన పశువుల్లో పాల దిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు. వేసవి తర్వాత వచ్చే వర్షాకాలం ప్రారంభంలో పశువుల మేతకు కొరత లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. పచ్చిమేత వలన పశువులకు పోషక విలువలు పుష్కలంగా అందుతాయి. కొన్నేళ్లుగా పశువులను మేపేందుకు కాపలాదారులు లేకపోవడంతో పశుపోషణ రైతులకు భారంగా మారింది. ఈ నేపథ్యంలో పశుపోషకులు స్వయంగా తమకున్న పొలంలో పది శాతం మేర పచ్చిగడ్డి పెంచుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

పశుగ్రాసాల్లో రకాలు

ధాన్యపు జాతి రకాలు: హైబ్రీడ్ మొక్కజొన్న, మొక్కజొన్న ధాన్యపు జాతి రకాలు. హైబ్రీడ్ మొక్కజొన్నలో పీసీ–23, ఎస్ఎస్‌జీ–58, ఎస్ఎస్‌జీ–59 అనే మూడు రకాలను ఎంపిక చేసుకోవాలి. మొదటి కోత 60 రోజులకు వస్తుంది. ఎకరాకు 30 నుంచి 35 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ప్రతి 40 రోజులకు ఒక కోత చొప్పున మూడు కోతలు వస్తుంది. మొక్కజొన్నలో ఆఫ్రికన్ టాల్ లేదా గంగ, హైబ్రీడ్ ఎఫ్, విజయా కిసాన్ రకాలున్నాయి. ఇది మొదటి కోత 60–70 రోజుల్లో వస్తుంది. దిగుబడి 20 నుంచి 25 టన్నుల మేర వస్తుంది. ఇది కూడా మూడు కోతలు వస్తుంది.

కాయజాతి పచ్చిమేతలు: అలసందలో యూసీసీ–5236, ఈసీ–4216, ఐసీ–4216, రష్యన్ రకాలున్నాయి. ఈ రకాలు 70 రోజుల్లో కోతకు వస్తాయి. 8 నుంచి 10 టన్నుల వరకు దిగుబడితో ఒక కోత మాత్రమే వస్తుంది. పిల్లిపెసర మొదటి కోత యాభై రోజులకు వస్తుంది. 8–12 టన్నుల దిగుబడి వస్తుంది .జనుము మొదటి కోత యాభై రోజులకు వస్తుంది. దీనిని కోత దశలో కోయాలి. ఒక కోతకు ఏడు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మొత్తం మీద రెండు కోతలు వస్తాయి. ఇలాంటి పచ్చిమేత పశువులకు అందిస్తే పాలదిగుబడి పెరిగి పశుపోషకులకు మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రయోజనాలివి

ఎండు మేత అనేది పశువులకు కడుపు నింపడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. పచ్చిమేత గేదె పాల దిగుబడి పెంపునకు ఉపయోగపడుతుంది. అందువలన రైతులు పచ్చిగడ్డి పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలి. పచ్చిగడ్డిలో అధిక పోషకాలు, విటమిన్లు ఎక్కువగా ఉండడం వలన గేదెలు త్వరగా ఎదకు వస్తాయి. పచ్చిమేతలో కాయజాతి, కాయజాతి కానివి, చిరుధాన్యాల వంటివి పెంచేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. కాయజాతి కాని రకాలు పశువులకు కావాల్సిన శక్తిని అందిస్తాయి. కాయజాతి రకాలు మాంసకృతుల వృద్ధికి తోడ్పడతాయి. పచ్చిగడ్డిలో 70 శాతం పోషకాలుంటే ఎండుగడ్డిలో కేవలం ముప్పై శాతం మాత్రమే పోషకాలుంటాయి.

2019 లెక్కల ప్రకారం జిల్లాలో పశుసంపద

గోవులు	:1,15,968
గేదెలు	:6,24,654
గొర్రెలు	:10,51,955
మేకలు	:3,51,546

మేలుజాతి గడ్డి రకాలు పెంచుకోవాలి



రైతులు మేలుజాతి గడ్డి రకాలను పెంచుకోవాలి. తమకున్న పొలంలో పదో వంతులో గడ్డి సాగుచేయడం వలన పశుగ్రాసానికి కొరత ఉండదు. మేలుజాతి గడ్డి రకం తినడం వలన పశువులు అధిక పాలను ఇచ్చి రైతులకు లాభాలు చేకూరుస్తాయి.

–కోటేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ వైద్యులు, వింజమూరు

ఇళ్ల స్థలాలపై విచారణ



లబ్ధిదారులను విచారిస్తున్న వీఆర్వో వెంకట్

ఉదయగిరి: మండలంలోని దాసరపల్లి సమీపంలో జాతీయ రహదారి రోడ్డు సెంటర్‌లో పేదలకు గత ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై కొందరు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వీఆర్వో వెంకట్ ఆదివారం విచారణ చేపట్టారు. 1998లో ప్రభుత్వం సర్వే నంబర్ 1191లోని 6.60 ఎకరాల విస్తీర్ణంలో 96 మంది లబ్ధిదారులకు పట్టాలు మంజూరుచేసింది. ఇటీవల వరకు లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టకుండా స్థలాలను అలాగే వదిలేశారు. ప్రస్తుతం ఇళ్ల స్థలాల వెంబడి కావలి–సీతారామపురం 167–బీజీ జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థలాల విలువ పెరగడంతో జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు పొందిన కొందరు లబ్ధిదారులు బేస్‌మట్టాలు నిర్మించుకుంటున్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు సంబంధించి హద్దులు తెలియకపోవడంతో కొందరు తమ ఇష్టానుసారంగా బేస్‌మట్టాలు వేసే ప్రయత్నంలో వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో కొందరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వాస్తవాలను నిర్ధారించుకునే నిమిత్తం వీఆర్వో విచారణ చేశారు. నివేదికను తహసీల్దార్‌కు అందజేయనున్నట్లు వీఆర్వో తెలిపారు.

నేడు సమన్వయ సమావేశం

సీతారామపురం: మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు సమన్వయ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్‌డీ సంస్థ చైర్మన్ డాక్టర్ కలివెల ఎలీషాకుమార్ తెలిపారు. మండల పరిధిలో చేపడుతున్న మూడు హైవేల నిర్మాణంలో భూములు, బావులు, గృహాలు కోల్పోయిన రైతులకు ఆశించిన మేర పరిహారం దక్కకపోవడంతో పలుచోట్ల నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడిందన్నారు. వాటిని పరిష్కరించే దిశగా ఇరువర్గాలతో రెవెన్యూ అధికారుల సమక్షంలో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాధిత రైతులంతా సంబంధిత పత్రాలతో హాజరుకావాలని ఆయన కోరారు.

ఉచిత వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ బిందుమీనన్

అనుమసముద్రంపేట: మండలంలోని అనుమసముద్రంలో నలిశెట్టి రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ బిందుమీనన్ ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 110 మందికి వివిధ రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఖర్చుతో కూడిన వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు డాక్టర్ బిందుమీనన్ ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులిమి సుధాకర్‌రెడ్డి, సిరాజ్, సాయి, నాషీర్, సుకుమార్, రిషి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు పొంగళ్లు



సంగం: చెన్నవరప్పాడులో పొంగళ్లు పెడుతున్న మహిళలు

ఉదయగిరి: మండలంలోని దుర్గంపల్లిలో గ్రామదేవతలు పోలేరమ్మ, అంకాళమ్మకు పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు నూతన బుట్టల్లో పొంగళ్ల సామగ్రిని ఉంచుకుని మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ ఊరేగింపుగా ఆలయాల వద్దకు చేరుకున్నారు. అనంతరం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.

నరసాలమ్మకు పొంగళ్లు

సంగం: మండలంలోని చెన్నవరప్పాడులో కొలువైన నరసాలమ్మకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. మహిళలు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా ఊరిబయట ఉన్న ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలను సమర్పించారు. తొలుత అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

రూ.3.77కోట్లు సముద్రం పాలు

- రెండేళ్లకే శిథిలమైన హరిత రిసార్ట్
- సేదతీరేందుకు పర్యాటకుల అవస్థ



శిథిలమైన రిసార్ట్ భవనం

కావలి: మండలంలోని తుమ్మలపెంట సముద్ర తీరంలోని హరిత రిసార్ట్ శిథిలావస్థకు చేరడంతో బీచ్‌కు వచ్చే పర్యాటకులు సేదతీరేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తుమ్మలపెంట తీరంలో రాష్ట్ర పర్యాటక శాఖ రూ.3.77 కోట్లతో హరిత రిసార్ట్ నిర్మాణం చేపట్టింది. 2016లో ప్రారంభించిన ఈ పర్యాటకుల విడిది ప్రదేశం రెండేళ్లకే శిథిలావస్థకు చేరింది. డివిజన్ కేంద్రమైన కావలికి తుమ్మలపెంట బీచ్ 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.ఇక్కడికి కావలి పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, ఉదయగిరి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం వస్తుంటారు. బీచ్‌కు వచ్చే పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని బీచ్ రిసార్ట్ నిర్మాణం చేపట్టాలని చాలా ఏళ్లుగా డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పర్యాటక శాఖ నిధులు రూ.3.77 కోట్లను మంజూరు చేయగా హడావుడిగా రిసార్ట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. సముద్ర తీరంలోని ఉప్పు ఇసుక, నాసిరకమైన సామగ్రితో నిర్మాణం చేపట్టడంతో రెండేళ్లకే శిథిలావస్థకు చేరింది. దీంతో అక్కడికి వచ్చి ఎవరూ గదులు తీసుకోకపోవడంతో లీజుదారుడు గోళ్లు గిల్లుకుంటున్నాడు. గత ఆరేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొని ఉండడంతో పర్యాటకశాఖ కూడా ఏమీ చేయలేక చేతులెత్తేసింది.సముద్ర తీరంలో సేద తీరుదామని వెళ్లిన పర్యాటకులకు రిసార్ట్ భవనం ఆవేదనను మిగుల్చుతోంది.

చుక్కల దుప్పిని చంపిన వ్యక్తి అరెస్ట్

ఉదయగిరి: దుత్తలూరు మండలం భైరవరం సమీపంలో చుక్కల దుప్పిని చంపి మాంసం విక్రయించేందుకు యత్నిస్తున్న ఓ వ్యక్తిని అటవీశాఖ అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఉదయగిరి రేంజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆత్మకూరు రేంజ్ అధికారి ఆర్ శేఖర్ వెల్లడించారు. వివరాలు.. భైరవరంలో చుక్కల దుప్పిని చంపి మాంసం విక్రయిస్తున్నారని ఉన్నతాధికారులు సమాచారం ఇవ్వడంతో ఆత్మకూరు, ఉదయగిరి రేంజ్ సిబ్బంది ఉమ్మడిగా దాడులు జరిపారు. గ్రామ సమీపంలోని పొలాల్లో వెంగయ్య అనే వ్యక్తి గురువారం రాత్రి విద్యుత్ కంచె ఏర్పాటు చేశాడు. ఈ కంచెను చుక్కల దుప్పి తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. దాన్ని వెంగయ్య కోస్తుండగా రేంజ్ సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతనితో పాటు దుప్పి మాంసం, కత్తులు, విద్యుత్ కంచెకు ఉపయోగించిన తీగలను స్వాధీనం చేసుకున్నట్లు ఆత్మకూరు రేంజ్ అధికారి తెలిపారు. దుప్పిని వధించిన ప్రాంతం ఆత్మకూరు రేంజ్ పరిధిలోకి వస్తుందన్నారు. నిందితుడ్ని సోమవారం ఉదయం ఉదయగిరి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. డీఆర్వోలు పిచ్చిరెడ్డి,రవీంద్రబాబు, శ్రీనివాసులు, ఎఫ్‌బీవోలు వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

కుమ్మరులకు పింఛన్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

సీతారామపురం: 50 ఏళ్లు దాటిన కుమ్మరులకు పింఛన్లు మంజూరు చేయాలని కుమ్మరి, శాలివాహన సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు ఆల్లూరి వెంకటసుబ్బయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మట్టితో తయారుచేసే ప్రతి వస్తువును పొల్యూషన్ కంట్రోల్‌బోర్డుకు అనుసంధానం చేస్తూ ప్రతి ఆలయం, ప్రభుత్వ కార్యాలయాల్లో వాటి వాడకాన్ని ప్రోత్సహించాలని కోరారు. జిల్లాలో కుమ్మరి కుల వృత్తిదారులు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో కేంద్రం నిధులతో కామన్ ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని పడమటి గూడూరులో సర్వే నంబర్ 1988లో ఉన్న 46 ఎకరాల భూమిని పింగాణి పరిశ్రమ కోసం కుమ్మరి శాలివాహన సంఘానికి తిరిగి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాలివాహన సంక్షేమ సంఘం నాయకులు ఆదిశేషయ్య, ఓబులపతి, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా మహాసభల జయప్రదానికి పిలుపు



ఆహ్వానపత్రికలను అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ స్థాపించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వచ్చే నెల 10న నెల్లూరులో నిర్వహించనున్న జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆత్మకూరు ఏపీటీఎఫ్ శాఖ సభ్యులు కోరారు. పట్టణంలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో కార్యవర్గ సభ్యుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. నెల్లూరులోని పురమందిరంలో నిర్వహించే విద్యా, వైజ్ఞానిక జిల్లా మహాసభల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యావంతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం పట్టణంలోని పలువురికి ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఏపీటీఎఫ్ బాధ్యులు చంద్రమోహన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంగయ్య, బండారు వెంకటేశ్వర్లు, సురేష్, ఖాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఆధ్యాత్మికతను పెంపొందించాలి



మంచి మాట కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

ఆత్మకూరు: తల్లిదండ్రులు తమ పిల్లల్లో చిన్ననాటి నుంచే ఆధ్యాత్మికతను పెంపొందిస్తే వారు క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకుంటారని తెలుగుభారతి సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఏపీ వెంకటరెడ్డి అన్నారు. పట్టణంలోని మేధా పాఠశాలలో తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో మంచిమాట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రధానవక్తగా వెంకటరెడ్డి మాట్లాడుతూ 'దేవునికెరుక' అన్న అంశంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. ఆధ్యాత్మికతకు ఆలవాలమైన భారతదేశం యజ్ఞ, యాగాదులతో అనాధిగా వేదభూమి వెలుగొందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడు గోవిందరెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎస్‌వీ చలమయ్య, రమణయ్య, యానాదిరెడ్డి, కే రవీంద్రకుమార్, నారాయణరావు, సాంబశివ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి, ఏపీజీబీ చైర్మన్ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర విజయవంతంపై ధన్యవాదాలు



శోభాయాత్ర కమిటీ సభ్యులకు సత్కారం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో తొలిసారిగా ఈ నెల 21న నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయడంపై నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం శోభాయాత్ర నిర్వాహకులు, పలువురు భక్తులతో సమావేశాన్ని నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున తమ ద్విచక్ర వాహనాలపై శోభాయాత్రలో పాల్గొని అగ్రభాగాన సాగడం హర్షించదగిన విషయమని నిర్వాహకులు అన్నారు. యాత్ర అనంతరం భోజనం వసతి కల్పించిన కంచి పరమేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తొలి నుంచి శోభాయాత్రకు కావాల్సిన ఏర్పాట్లు చేసిన కార్యకర్తలు, కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

సనాతన ధర్మసారమే భగవద్గీత



ప్రవచిస్తున్న గీతా ట్రస్ట్ చైర్మన్ షేక్ నజీర్‌బాషా

ఆత్మకూరు: కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడికి భగవాన్ శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధించారని, అది సనాతన ధర్మసారమని నెల్లూరుకు చెందిన గీతా వైభవ ట్రస్ట్ చైర్మన్ షేక్ నజీర్‌బాషా అన్నారు. పట్టణంలోని షిర్డీ సాయి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో భగవద్గీతలోని ఆత్మతత్వంపై ఆదివారం ఆయన ప్రవచించారు. భగవద్గీత నిత్యం పఠించాల్సిన గ్రంథమన్నారు. ప్రస్తుత కాలంలో దురదృష్టవశాత్తు మృతుల ఇంటి వద్ద మాత్రమే భగవద్గీత శ్లోకాలు వినిపించడం శోచనీయమన్నారు. గీతలో ధ్యాన, జ్ఞాన గుణాలతో పాటు శాఖాహార ప్రాముఖ్యత, దాని ద్వారా పెంపొందే ఆధ్యాత్మికతను వివరించారన్నారు. ధ్యాన కేంద్రం నిర్వాహకులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, మహిళలు అధికంగా పాల్గొన్నారు.

గంధ మహోత్సవానికి రూ.లక్ష విరాళం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి

ఉదయగిరి: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్‌ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఖాదరి ఔలియా దర్గాలో వచ్చే నెల 3న నిర్వహించనున్న గంధ మహోత్సవానికి కావలి ఎమ్మెల్యే డీ వెంకటకృష్ణారెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. ఆయన ఏటా గంధ మహోత్సవానికి విరాళాన్ని అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో కావలిలోని నివాసంలో వెంకటకృష్ణారెడ్డిని గంధ మహోత్సవ నిర్వాహకులు కలవగా నగదు అందజేశారు. అనంతరం గంధ మహోత్సవానికి సంబంధించిన ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు రోజ్‌దార్ మన్సూర్, కార్యదర్శి ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రం



నిరుపయోగంగా మారిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



గాలికి వదిలేసిన విలువైన యంత్రం



తుప్పు పట్టిపోతున్న చెత్త సేకరణ రిక్షాలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా మారింది. గతంలో జిల్లాలోనే ఆదర్శంగా నిలిచి అవార్డు అందుకున్న ఈ కేంద్రం నిర్వహణ పూర్తిగా గాలికి వదిలివేశారు. రూ.లక్షల విలువ చేసే యంత్రాలు, రిక్షాలు, ఇతర పరికరాలను నిరుపయోగంగా వదిలివేయడంతో ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ తుప్పు పట్టుతున్నాయి. వింజమూరు పట్టణంలో సేకరించే చెత్తను ఈ కేంద్రం పక్కనే డంప్ చేసి నిప్పు పెడుతున్నారు. దీంతో కాలుష్యంతో చుట్టుపక్కల ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారు. అదే కేంద్రాన్ని ఉపయోగించి చెత్తను ఎరువుగా మార్చి విక్రయిస్తే పంచాయతీకి ఆదాయంతో పాటు కొంత మందికి ఉపాధి దొరుకుతుంది. వాతావరణ కాలుష్యం నివారించబడుతుంది. ఆ దిశగా జిల్లా అధికారులు, పంచాయతీ పాలకులు ఆలోచన చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.